క్లుప్తంగా

విద్యాభివృద్ధికి కృషి చేయండి



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న హైస్కూల్ హెచ్‌ఎంలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యాభివృద్ధికి హెచ్‌ఎంలు కృషి చేయాలని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. స్థానిక వీవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన నాగభూషణంరెడ్డి శుక్రవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాడు–నేడు కింద పాఠశాలలో భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయించేందుకు కృషి చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. ఎస్‌ఎస్‌ఎస్ హైస్కూల్ హెచ్‌ఎం మధుసుదన్ రాజు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

హొళగుంద: ఆదోని డిపో నుంచి హొళగుంద మండలంలోని వివిధ గ్రామాలకు రద్దు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కే గిరి జిల్లా ఆర్టీసీ ఆర్‌ఎం వెంకటరామంను కోరారు. శుక్రవారం ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కర్నూలులో ఆర్‌ఎంను కలిసి బస్సుల రద్దు, రూటు మార్పు కారణంగా ప్రజలు, విద్యార్థులు పడ్తున్న అవస్థలను వివరించారు. వెంటనే రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని ఆర్‌ఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు గిరి తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న వై.రుద్రగౌడ్

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో రూపుదిద్దుకున్నాయని రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం గుడేకల్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. సింగిల్ విండో అధ్యక్షుడు వై.పురుషోత్తంగౌడ్, హెచ్‌ఎం నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

వైద్య బృందం పరిశీలన



తెర్నేకల్ గ్రామాన్ని సందర్శించిన వైద్యాధికారులు

దేవనకొండ: మండలంలోని తెర్నేకల్ గ్రామంలో వృద్ధురాలు బజారమ్మకు డెంగీ లక్షణాలు కనిపించడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. సర్పంచ్ అరుణకుమార్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శి రాముడు, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరయ్య, తదితరులు శుక్రవారం గ్రామంలోని వివిధ కాలనీలను పరిశీలించి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. అలాగే బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కాలువలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాల శుభ్రత పాటించాలని మలేరియా నివారణ అధికారి సాయిబాబు గ్రామస్తులకు సూచించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

పత్తికొండ రూరల్: గర్భస్థ శిశువు ఆడ, మగ తెలుసుకోవడానికి లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం అని ఆర్డీఓ మోహన్‌దాస్ సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో గర్భస్థ పిండ పరీక్ష నియంత్రణ సబ్ డిస్ట్రిక్ లెవెల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ, పురుషుల మధ్య వివక్ష తగదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ మురళీమోహన్, వైద్యురాలు హారిక, మైత్రిచారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రామ్మోహన్, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాష, సుమలత తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా విద్యుత్ సేవలు

కృష్ణగిరి: వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఏఈ మద్దిలేటి ఆధ్వర్యంలో అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఎంపీపీ, ఈఈ మాట్లాడుతూ.. రైతులకు పగటిపూట 9 గంటల విద్యుత్ అందిస్తున్నట్లు, కోరిన వారికి వెంటనే కనెక్షన్, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలను తెలుపుతూ, వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఈ వెంకటేశ్వర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఆర్బీకేలు

- రైతన్నలకు వెన్నుదన్నుగా సేవలు
- గ్రామాల్లోనే రైతులకు విత్తనాలు, ఎరువులు
- పంటల సాగులో సూచనలు, సలహాలు
- ఈ–క్రాప్ ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ



రైతుకు సబ్సిడీ ట్రాక్టరు అందజేస్తున్న ఏఓ



ఆర్బీకేలో రైతులకు సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేస్తున్న దృశ్యం



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సిబ్బంది

పత్తికొండటౌన్: గ్రామ స్థాయిలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్బీకేలను ప్రారంభించినప్పటి నుంచి రైతాంగానికి అండగా ఉంటూ వారికి భరోసా కల్పిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రైతులు దోపిడీకి గురికాకుండా, అడుగడుగునా రక్షణ కల్పిస్తున్నాయి. నాడు టీడీపీ హయాంలో వ్యవసాయం దండగ అనే పరిస్థితి ఉంటే.. నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో పండగలా మారింది. సీఎం కృషితో అన్నదాతల్లో కొండంత ధైర్యం నెలకొంది.

గతంలో ఇలా..

వ్యవసాయ సాగు అంటే ఏటా రైతుకు కష్టాలే ఉండేవి. ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు వచ్చి రోజుల తరబడి, వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరిగి, గంటల పాటు క్యూలో నిల్చుని పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఆరుగాలం కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించేది కాదు. వ్యవసాయ శాఖ సబ్సిడీ పనిముట్లు, యంత్ర పరికరాలు అన్నీ రైతుల పేరిట టీడీపీ నాయకులే తీసుకునేవారు.

ప్రస్తుతం ఇలా..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు వారి చెంతకే చేరుస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో అందుతున్న సేవలు

- ఖరీఫ్, రబీ సీజన్లలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు రైతులకు పంపిణీ
- పంటకోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనా
- వైఎస్సార్ పొలం బడి కార్యక్రమంలో బాగంగా రైతుల పొలాల వద్దకు వెళ్లి పంటల సాగు, చీడపీడల నివారణలో సలహాలు, సూచనలు
- పంటల సాగుకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు. దీని ఆధారంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి రైతులు నష్టపోయినపుడు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోంది.
- కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు. దీని ద్వారా ఐదుగురు సభ్యులతో గ్రూపు ఏర్పాటుచేసి వారికి వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రూ.15లక్షలు విలువ చేసే యంత్ర పరికరాలను 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నారు. ఇందులో రైతుల వాటా 10 శాతం కాగా, మిగతా 50 శాతం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నారు.
- పంటల దిగుబడులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు రైతులకు సహకారం

మండలాల వారీగా రైతులకు అందించిన సేవలు

పత్తికొండ:	మండలంలో ఆర్బీకేలు–16, రైతుల సంఖ్య–11,583, రైతుభరోసా లబ్ధిదారులు–10,494, లబ్ధి–రూ.5.77 కోట్లు, యంత్ర పరికరాల ద్వారా లబ్ధి పొందిన రైతులు–80, ఈ ఖరీఫ్‌లో 1750 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ.
తుగ్గలి:	మండలంలోని ఆర్బీకేలు–18, రైతుల సంఖ్య–19,500, రైతుభరోసా లబ్ధిదారులు–14,200, 2021 ఖరీఫ్‌లో పంటల బీమా కింద 18,331 మంది రైతులకు రూ.24.26 కోట్లు పరిహారం మంజూరు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,600 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ
మద్దికెర:	మండలంలోని ఆర్బీకేలు–9, రైతుల సంఖ్య–10,212, రైతుభరోసా లబ్ధిదారులు–7,352, లబ్ధి–రూ.27.57 కోట్లు, ఆర్‌బీకేలలో ఎరువులు, విత్తనాలు కొన్నవారు –8,321, యంత్రపరికరాలు తీసుకున్న వారు–182 మంది
క్రిష్ణగిరి:	మండలంలోని ఆర్బీకేలు–14, రైతుల సంఖ్య–18,678, రైతుభరోసా లబ్ధి పొందిన రైతులు–14,250, లబ్ధి–రూ.50.10 కోట్లు, ఎరువులు, విత్తనాలు తీసుకున్న రైతులు–8,321, యంత్ర పరికరాలు తీసుకున్న వారు–70
వెల్దుర్తి:	మండలాలలోని ఆర్బీకేలు–18, మొత్తం రైతులు–21,200, రైతుభరోసా పొందిన రైతులు–10,977, ఇప్పటివరకు లబ్ధి–రూ.60.20 కోట్లు, ఎరువులు, విత్తనాలు అందుకున్న వారు–6,126 మంది, యంత్ర పరికరాలు తీసుకున్నవారు–1109

రైతుల ఇబ్బందులు తొలగాయి



ఆర్బీకేల్లో మాకు అన్నీ రకాల సేవలు అందుతున్నాయి. ఎలాంటి ఇబ్బంది లేదు. నాకు 8 ఎకరాల పొలం ఉంది. గతంలో ప్రతి ఏటా ఎరువులు, విత్తనాల కోసం క్రిష్ణగిరి, వెల్దుర్తి, డోన్‌లోని ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్లేవాళ్లం. ఇపుడు అన్నీ మా ఊళ్లోనే దొరుకుతున్నాయి. రైతు భరోసా క్రమం తప్పకుండా ఇస్తున్నారు.

– గిడ్డయ్య, సంగాల, క్రిష్ణగిరి మండలం

ఉన్న ఊర్లోనే అన్నీ అందుతున్నాయి



విత్తనాలు, ఎరువుల కోసం ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేదు. అన్నీ మా ఊర్లోనే అందుతున్నాయి. నాకు 4 ఎకరాల పొలం ఉంది. గత నాలుగేళ్లుగా రైతు భరోసా సాయం అందింది. వైఎస్సార్ జలకళ ద్వారా బోరు వేశారు. నీళ్ల సమృద్ధిగా పడ్డాయి. సీఎం జగనన్న వ్యవసాయాన్ని పండుగ చేశారు.

– ఉమర్‌సాహెబ్, రైతు, దూదేకొండ, పత్తికొండ.

దేశానికే ఆదర్శం ఆర్బీకేలు



రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా రైతులకు గతంలో కంటే ఎంతో మేలు జరుగుతోంది. రైతులకు కావాల్సిన సమాచారం, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అన్నీ ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి

– విజయకుమార్, ఏడీఏ, పత్తికొండ

ఎమ్మిగనూరు ఐసీడీఎస్ పరిధిలోకి గోనెగండ్ల

గోనెగండ్ల: నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పటికీ గోనెగండ్ల మండలం ఐసీడీఎస్ పరిధి పత్తికొండ నియోజకవర్గంలో ఉండేది. దీంతో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు కార్యాలయానికి వెళ్లేందుకు ఇబ్బంది పడేవారు. పునర్విభజన జరిగి దాదాపు 15 ఏళ్లు అయినప్పటికీ ఐసీడీఎస్ మాత్రం పత్తికొండ పరిధిలో ఉండేది. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించారు. దీంతో గోనెగండ్ల మండలం పత్తికొండ ప్రాజెక్టు పరిధి నుంచి ఎమ్మిగనూరు ప్రాజెక్టు పరిధిలోకి మారింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని, ఇక నుంచి గోనెగండ్ల మండలం అంగన్‌వాడీ కార్యక్రమాలు ఎమ్మిగనూరు పరిధిలో ఉంటాయని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రి శుక్రవారం వెల్లడించారు. దీనిపై మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె జూనియర్ కళాశాలలో గణితం బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధనుంజయ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గణిత శాస్త్రంలో ఎంఎస్సీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు 20వ తేదీన డెమో క్లాస్ ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు గంటకు రూ.150 చొప్పున నెలకు రూ.10 వేలకు మించకుండా గౌరవ వేతనం ఉంటుందని వెల్లడించారు.

ఈ–కేవైసీ చేయించుకోండి

మద్దికెర: పీఎం కిసాన్ పథకానికి సంబంధించి మండలంలోని 1,080 మంది రైతులు ఈ–కేవైసీ చేయించలేదని, ఇప్పటికైనా నమోదు చేయించుకోవాలని ఏఓ రవి శుక్రవారం సూచించారు. గ్రామాలలో ఇప్పటివరకు 7,236 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నట్లు వివరించారు. ఈ–కేవైసీ నమోదు చేసుకున్న వారికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు వర్తిస్తాయన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు

నందవరం: బాల్య వివాలను అరికట్టడం అందరి బాధ్యత అని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులు, పొదుపు సంఘం లీడర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో బాల్య వివాహాల నివారణపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో మండల కమిటీలు నివారణ చర్యలు చేపడతాయన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకారించాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల నివారణలో భాగంగా గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. యువతికి 18 సంవత్సరాలు, యువకుడికి 21ఏళ్లు దాటిన తరువాత వివాహం చేయాలని, బాల్య వివాహాలు చేస్తే చట్ట రీత్యా నేరమన్నారు. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం



డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి

వెల్దుర్తి: మైనర్లు వాహన డ్రైవింగ్ చేయడం నేరమని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లు, వారిని ప్రోత్సహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల పట్టణంలో మైనర్ల మోటార్ సైకిళ్ల డ్రైవింగ్ మితి మీరడం, ర్యాష్ డ్రైవింగ్‌పై ఎస్‌ఐ శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకుని రూ.26,525 జరిమానా విధించారు. అనంతరం పట్టుబడ్డ మైనర్లు, వారి తల్లితండ్రులకు స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే సంబంధిత వ్యక్తితో పాటు అవతలి వైపు వారి కుటుంబాలు వీధిన పడతాయని వివరించారు. తల్లిదండ్రులు, వాహనాల యజమానులు మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని సూచించారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథరామయ్య

నందవరం: జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కృష్ణమూర్తి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులు, సిబ్బందికి గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి వేగవంతం చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం జగనన్న కాలనీలో సకల సౌకర్యాలు కల్పిస్తుందని, ఇంటికి ఉచితంగా కరెంట్ మీటర్ కూడా అందిస్తుందన్నారు. లబ్ధిదారులు వివిధ దశలో ఉన్న ఇంటి నిర్మాణాలను ప్రారంభించాలని కోరారు. వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, హౌసింగ్ ఏఈ గురుస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగన్న

వెల్దుర్తి: ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పథకాలతో ప్రభుత్వ కార్యాలయాల సామర్థ్యం, సేవలు పెరిగాయని వివిధ శాఖల మండలాధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు తమ పరిధిలో అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఉలిందకొండ పీహెచ్‌సీ సిబ్బంది నాగన్న మాట్లాడుతూ మండలంలో వైద్య సేవలు పెరిగాయని, రామళ్లకోట, గోవర్ధనగిరి పీహెచ్‌సీలకు వైద్యుల నియామకం జరిగిందన్నారు. ఏఓ అక్బర్‌బాష మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో నీటి పారుదల, బెట్ట పడని పొలాల రైతులకు నూతన వంగడమైన కంది విత్తనాలు ఎకరాకు 4 కేజీల ప్రకారం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమస్యల ప్రస్తావన లేకుండా సాదాసీదాగా కార్యక్రమం జరిగింది. ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి, ఈఓఆర్డీ నరసింహులు, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆలూరు రూరల్: స్థానిక మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 9 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వీరేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తుందని చెప్పారు.

విద్యార్థులు లోకేష్ నాయక్, పావన శ్రీ, సుమలత, రాజీ, గౌతమి, రామ్‌చరణ్, అంజలి, ఇస్‌పితా, ప్రవల్లిక స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కేసు నమోదు

కృష్ణగిరి: వాటర్ ప్లాంట్‌లోకి అక్రమంగా ప్రవేశించి అందులో పనిచేస్తున్న తనపై దాడి చేసినట్లు కంబాలపాడుకు చెందిన రంగస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడ్డ అదే గ్రామానికి చెందిన రాముగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రోఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. గురువారం సంఘటన వివరాలు తెలుపుతూ.. పొలం పంచాయతీకి సంబంధించి నిందితుడు ఫిర్యాదిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. కేసు విచారిస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బపై అప్రమత్తం

హాలహర్వి: ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ మన్సూర్‌వలీ సూచించారు. శుక్రవారం ఆయన ఆస్పత్రికి వచ్చిన రోగులకు వడదెబ్బ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం వేళల్లో బయట తిరగరాదన్నారు. నీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలన్నారు. తెల్లటి వస్త్రాలను ధరిస్తే ఎండవేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందవచ్చన్నారు. వడదెబ్బ సోకిన వారికి వెంటనే నీరు తాపించి దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలన్నారు. ఉపాధి పనులకు వెళ్లే వారు ఉదయం 11 గంటల్లోపే ఇళ్లకు చేరుకోవాలన్నారు. వడదెబ్బ ప్రాణాంతకమని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు.

లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

తుగ్గలి: లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ముంబై నుంచి చెన్నైకు కంపెనీ సామగ్రితో వెళుతున్న లారీ శుక్రవారం మార్గమధ్యలో గిరిగెట్ల కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో షోలాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ జ్ఞానేశ్వర్, క్లీనర్ సంతోష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం పత్తికొండ, అనంతపురం ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.

నేడు సమావేశం

ఆలూరు: స్థానిక వాసవీ కల్యాణ మండపంలో శనివారం మంత్రి గుమ్మనూరు జయరాం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. అన్ని ఉద్యోగ సంఘాల సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ప్రకటనలో కోరారు.

బాధ్యతలు తీసుకున్న హెచ్‌ఎంలు

మద్దికెర: ప్రధానోపాధ్యాయుల సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న వారు బదిలీ కావడంతో వారి స్థానంలో వచ్చిన హెచ్‌ఎంలు బాధ్యతలు తీసుకున్నారు. మద్దికెర జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు దేవేంద్రప్ప, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు అజరయ్యబాబు, ఎం.అగ్రహారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎస్‌ఎండీ ఫరూక్, పెరవలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఉమ నియమితులైనట్లు ఎంఈఓ రంగస్వామి శుక్రవారం తెలిపారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి

తుగ్గలి: పొదుపు సంఘాల ద్వారా తీసుకునే రుణాలతో డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రాధాకృష్ణ సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం విలేజ్ బుక్ కీపర్లకు పొదుపు సంఘాల బలోపేతంపై అవగాహన కల్పించారు. హార్టికల్చర్ ఏఓ దస్తగిరి, సీసీలు సంఘాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. చిన్నచిన్న కుటీర పరిశ్రమలు, పాడి పశువులు, జీవాల పెంపకం, షాపులు తదితర వాటిని ఏర్పాటు చేసుకొని ఆదాయం పొందేలా పొదుపు మహిళలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం పొదుపు సంఘాల్లోని మహిళలకు వడ్డీలేని రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలు అందిస్తూ అండగా నిలుస్తోందన్నారు. సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి రూ.లక్ష విరాళం



దర్గా నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: కుల, మతాలకు గ్రామాల్లో ప్రజలు కలసి, మెలసి జీవించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో శుక్రవారం.. ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలో కొలువుదీరిన హుసేన్ సాబ్ దర్గా మరమ్మతు పనులకు మంత్రి గుమ్మనూరు జయరాం రూ.లక్ష విరాళంగా అందజేశారు. దర్గా నిర్వాహకులకు సొమ్ము అందించారు. దర్గా అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. ములుగుందం గ్రామానికి చెందిన హనుమంతు, భీమన్న, చిన్నప్ప, ఖాసీం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంభీమ్‌నాయుడు తదితరులు ఉన్నారు.


సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం 30వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కె.విశ్వనాథ్ తదితరులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ పింఛన్లు సమయానికి అందుతున్నాయా? ఏమైనా సమస్యలున్నాయా ? అని ఆరాతీశారు. అలాగే లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్ అందజేశారు. వార్డు పరిధిలో సీసీ రోడ్లు నిర్మించాలని కొందరు ఆయన దృష్టికి తీసుకురాగా సత్వర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్,పార్టీ నాయకులు, నజీర్, వీరేంద్ర, రియాజ్‌అహమ్మద్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు ప్రోత్సాహం



పదో తరగతి టాపర్లకు ప్రోత్సాహకాలు అందిస్తున్న బొమ్మన రవిరెడ్డి, సర్పంచ్ తదితరులు

వెల్దుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారికి తమ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం మిగతా వారిలో స్ఫూర్తి నింపుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్/ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసూన ఆధ్వర్యంలో గతేడాది పదవ తరగతి ఫలితాలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన (బి.మౌనికాబాయి–549 మార్కులు, పి హరిత–522, కె.నందిని–521)లకు ‘జగనన్న ఆణిముత్యాలు’ పేరిట నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బొమ్మన రవిరెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజ, పీఎంసీ చైర్మన్ సెంట్రింగ్ ఏసు పాల్గొని విద్యార్థినులకు మెడల్స్, నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందించారు. అలాగే పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో చేర్పించండి



ముగతిలో పిల్లలతో ఐసీడీఎస్ అధికారులు

నందవరం: మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, ఆటపాటలతో కూడిన విద్య బోధన ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ.సుధావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం–4లో చిన్నారులతో ‘అంగన్‌వాడీ బడి బాట’ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందిస్తారన్నారు. నాడు–నేడు ద్వారా అంగన్‌వాడీ సెంటర్ల రూపురేఖలు మారుతున్నాయని వివరించారు. మూడేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అలాగే ఐదేళ్ల పిల్లలను బడి బాట పట్టించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం మద్దిలేటి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ లలిత చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ సెంటర్–12లో చిన్న పిల్లల తల్లులకు ఆమె అవగాహన కల్పించారు. ఆలూరు సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు ఉన్నారు.

‘జగనన్న సురక్ష’ పక్కాగా నిర్వహించాలి

ఆలూరు రూరల్: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి ఇంటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని తెలుసుకుని అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలని ఎంపీడీఓ అల్లబకాష్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఈ నెల 23 నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి పథకంపై అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకు అందిన పథకాల గురించి వివరించి.. ఆ ఇంటికి అందాల్సిన పథకాలను తెలుసుకుని అందేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా అని ఆరా తీయాలన్నారు. ఇలా గుర్తించిన లబ్ధిదారులకు ఆగస్టు నెల 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందని చెప్పారు. ఆలూరు ఈఓ కృష్ణ కుమార్ అన్ని సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు హాజరయ్యారు.